సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా


సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



కోర్కెలు తీర్చే మహా వృక్షం

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద వృక్షంగా పేరుగాంచిన తిమ్మమ్మ మర్రిమాను మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది.

8లో



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.6°/15.2°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

కంచె వేసి .. కష్టపెట్టి !



ప్లాన్ ప్రకారం ఉన్న మొరసలపల్లి పొలం నుంచి వయా కోడూరు, కొడికొండ పొలానికి వెళ్లే బండి బాటకు కంచె వేసిన దృశ్యం


చిలమత్తూరు మండలంలో రియల్టర్ రెడ్డెప్పశెట్టి ఆగడాలు శ్రుతిమించిపోయాయి. వందలాది ఎకరాల భూమి ఉన్న ఆయన ఏకంగా చిత్రావతి నదినే రాయించుకొని నదిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. తాజాగా అతనికి సంబంధించిన మరో దురాగతం వెలుగులోకి వచ్చింది. తన 'సామ్రాజ్యం' గుండా ఎవరినీ వెళ్లనీయకుండా ప్లానింగ్‌లోని రహదారులకు కూడా కంచె వేస్తున్న సంగతి బయట పడింది.

- చిలమత్తూరు మండలంలో శ్రుతిమించిన రియల్టర్ రెడ్డెప్పశెట్టి ఆగడాలు
- ప్లానింగ్‌లో ఉన్న రోడ్లను కూడా మూసేస్తున్న వైనం
- లబోదిబోమంటున్న రైతులు
- నాలుగు వైపులా కంచె వేస్తుండటంతో వ్యవసాయానికి దూరమవుతున్నామని ఆవేదన
- అన్నీ తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, అనంతపురం: రియల్టర్ రెడ్డెప్పశెట్టి దెబ్బకు చిలమత్తూరు మండలంలో రైతులు విలవిలలాడిపోతున్నారు. ఏకంగా రోడ్ల మ్యాపులను కూడా తారుమారు చేస్తూ రహదారులను క్లోజ్ చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది కాదు 15 కాదు.. ఏకంగా 600 ఎకరాలకు రెడ్డెప్పశెట్టి కంచె వేశాడంటే ఆయన సామ్రాజ్యం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

భూమి కొనడం.. దారులు మూసేయడం

గతంలో కోడూరు పొలం 675 సర్వే నెంబరు గుండా బండి బాట ఉండేది. మూడు సంవత్సరాల క్రితం రెడ్డెప్పశెట్టి తన తమ్ముడు రవి , ఉదయ్‌కుమార్ పేరుమీద భూములు కొనుగోలు చేసి 675, 673లలో ఉన్న దారులను మూసి వేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులకు సైతం పలుమార్లు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోగా అందరూ రెడ్డెప్పశెట్టికే సహకరించడంతో చేసేది లేక రైతులు కొడికొండ పొలం సర్వే నెంబర్లు ఎఫ్‌ఎంబీ ప్రకారం 160, 163, 164 లలో ఉన్న దారి గుండా పొలాలకు వెళుతున్నారు. అయితే ఇటీవలే మరో ముగ్గురికి సంబంధించిన భూమిని ఆయనే కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. అడ్వాన్స్ కూడా ఇచ్చి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో కోడూరు పొలంలోలానే కొడికొండ పొలానికి కూడా కంచె వేసి దారులన్నీ మూసి వేస్తే తమ పొలాలకు వెళ్లే దారులు కూడా లేకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 164 సర్వే నెంబరులో కాలువలు కూడా ఉండగా, గతంలో 158 సర్వే నెంబరు గుండా భూములను కొనుగోలు చేసిన రెడ్డెప్పశెట్టి ఆరు లింకులు ఉన్న కాలువను కూడా మూసి వేసి చెరువుకు నీరు రాకుండా చేయడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. అలాగే కొడికొండ గ్రామానికి చెందిన నరసింహులు అనే మాజీ ఎంపీటీసీకి చెందిన సర్వే నంబరు 14, 15 లలో 23 ఎకరాల భూమి ఉంది. అయితే



ప్లానింగ్‌దారులను చూపే ఎఫ్‌ఎంబీ



23 ఎకరాలకు దారి ఉందని అధికారులు ఇచ్చిన వివరణ పత్రం

ఈ పొలానికి వెళ్లాలంటే కోడూరు పొలం 673, 678, 677 గుండా ప్లాన్ మార్కు రస్తా ఉంది. అయితే రెడ్డెప్పశెట్టి ఆ దారిని మూసి వేసి వారినీ ఇబ్బందులకు గురిచేశారు. వారు న్యాయపోరాటం చేయగా కొన్ని సంవత్సరాల అనంతరం అధికారులు దారిని క్లియర్ చేయించారు. తాజాగా మళ్లీ దారి మూసివేయడంతో సదరు రైతు తమ పొలానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాడు.

న్యాయం చేయండి



కొడికొండ పొలం సర్వే నంబరు 159లో మా కుటుంబానికి 16 ఎకరాల భూమి ఉంది. 158–3 లో కూడా ఉంది. ఇవే సర్వే నంబర్లలో రెడ్డప్పశెట్టి భూమి కొనుగోలు చేస్తున్నాడట. ప్లానింగ్‌లో దారి ఉన్న సర్వే నంబర్లలో ఉన్న భూమిని కొనుగోలు చేస్తున్నాడని తెలిసింది. దీంతో వాటికి కూడా కంచె వేయాలని చూస్తున్నాడు. అదే జరిగితే మా భూమికి దారి లేకుండా పోతుంది. భూమికి విలువపోవడంతో పాటుగా మేమంతా వ్యవసాయం కూడా చేయలేని పరిస్థితి వస్తుంది. ఆయన ధనవంతుడు కాబట్టి అధికారులు అందరూ ఆయనకే మద్దతుగా ఉన్నారు. మాకు ప్లానింగ్‌లో ఉన్న ప్రకారంగా దారి కల్పించాలి.

– బాలసుబ్రహ్మణ్యం , రైతు, కొడికొండ

పోరాడి అలసిపోయాం



రెడ్డెప్పశెట్టి ఎన్నో ఇబ్బందులు పెడుతున్నారు. నాకున్న 23 ఎకరాల భూమికి ప్లానింగ్‌లో ఉన్న ప్రకారం దారి ఇవ్వాలి. అయితే ఆయన భూమి కొనుగోలు చేసుకొని కంచె వేసుకోవడం ద్వారా దారి లేకుండా పోయింది. దారి కోసం అధికారులను వేడుకున్నాం. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో దారి క్లియర్ చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ దారి మూసి వేశాడు. దీంతో మళ్లీ ఇబ్బంది ఏర్పడింది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నరసింహులు,
మాజీ ఎంపీటీసీ, కొడికొండ

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా తెలియజేయవచ్చన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీ వి. రత్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

యువకుడి ప్రాణాలు బలిగొన్న మద్యం

కదిరి అర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు (28) మృతి చెందాడు. శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడిని శ్రీనివాసులుగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఇటీవల మద్యానికి బానిసైన శ్రీనివాసులు శనివారం సాయంత్రం అతిగా తాగి ప్రమాదవశాత్తు విఠలరాయుని చెరువులో పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు

నిపుణుల కమిటీ నియామకానికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తి టౌన్: యునెస్కో వారసత్వ కట్టడాల జాబితాలో లేపాక్షి వీరభద్రాలయానికి శాశ్వతంగా చోటు దక్కేలా నిపుణుల కమిటీని నియమించి నివేదిక రూపొందించాలంటూ ఏపీ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకుడు మల్లికార్జునకు జిల్లాకు చెందిన చరిత్రకారుడు మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడలోని ఏపీ సాంస్కృతిక వ్యవహారాల శాఖ కార్యాలయంలో మల్లికార్జునను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పుట్టపర్తిలో సాయిగీత పార్క్



చిత్రావతి ఒడ్డున ఏర్పాటు చేసిన బాబా భారీ కటౌట్

పుట్టపర్తి రూరల్: సత్యసాయి బాబా నడయాడిన చిత్రావతి నది ఒడ్డున సాయి గీతా పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆదివారం సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అలాగే హారతి ఘాట్ ఎదురుగా నది ఒడ్డున సత్యసాయి 36 అడుగుల భారీ కటౌట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బాబా పెంపుడు ఏనుగు సాయి గీత స్మృతికి గుర్తుగా పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సాయి భక్తులతో పాటు పర్యాటకులకు ఆహ్లాదాన్ని ఇచ్చే విధంగా పార్క్‌ను తీర్చిదిద్దుతామని రత్నాకర్ తెలిపారు.



పార్క్‌కు భూమి పూజ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

ప్రచారం మాని చెరువులకు నీళ్లివ్వండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హితవు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్రంలో హిందూపురం సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: హంద్రీనీవా నీటిని హిందూపురంతో పాటు మడకశిరకు వదులుతున్నామని ప్రచార ఆర్భాటం చేసుకోవడానికే టీడీపీ నేతలు పనికి వస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. హంద్రీనీవా నీటిని హిందూపురం చెరువులకు వదులుతున్నట్లు టీడీపీ ప్రచారం చేస్తుండటంపై ప్రజలు, రైతులు నవ్వుకుంటున్నారన్నారు. ఆదివారం హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఇప్పుడు 1.5 టీఎంసీ నీరు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని, అందులో కియా పరిశ్రమకు కూడా వాటా ఉందన్నారు. పెనుకొండ నియోజకవర్గానికి పూర్తిగా నీరు ఇవ్వకుండానే పురానికి నీళ్లిస్తామని చెప్పడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు కూడా నీటిని ఇచ్చామని చెప్పారు. అయితే మంత్రి సవిత ఇప్పుడు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని, ఒకటో , రెండో చెరువులు నింపి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆరేళ్ల తర్వాత నీళ్లు వస్తున్నాయని అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. జగనన్న సీఎంగా ఉన్నప్పుడు ప్రతి చెరువుకూ నీళ్లిచ్చామని, ఇప్పుడు కుప్పంకు నీరు తీసుకెళ్లాలన్న తాపత్రయంతో ఆగమేఘాలతో పనులు ప్రారంభించారన్నారు. నీరు వదలడం, ఎక్కడిపడితే అక్కడ తెగిపోతుండటంతో నీరు ఆపేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ సాకుతో మొత్తం నీరు కుప్పంకు తీసుకువెళ్లాలన్న ఎత్తుగడ వేశారా అన్న అనుమానం కలుగుతోందన్నారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

39 చెరువులనూ నింపాల్సిందే

హిందూపురం నియోజకవర్గంలోని 39 చెరువులకు కచ్చితంగా నీరివ్వాల్సిందే అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో చెరువులు నిండాలంటే 0.85 టీఎంసీ నీరు అవసరమని, మొత్తం మూడు నియోజకవర్గాలకు కలిపి ఒక టీఎంసీ నీరిస్తే ఎలా చెరువులన్నీ నిండుతాయని ప్రశ్నించారు. చెరువులను నింపకపోతే మాత్రం పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీరిస్తామని 2014లో గెలిచిన సందర్భంలో చెప్పారని, ప్రజలు రెండుసార్లు అధికారమిచ్చినా ఆయన ఇప్పటికీ మాట నిలబెట్టుకోలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గిరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, నిస్సార్ అహ్మద్, నరసింహమూర్తి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ ఆసిపుల్లా, కౌన్సిలర్లు షాజియా, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుడు మోసం చేశాడని..

- వాస్మాయిల్ తాగిన ఇద్దరు యువతులు
- ఒకరి మృతి, మరొకరు ఆస్పత్రిలో..
- అనంతపురం నగరంలో ఘటన



మృతి చెందిన శారద



నిందితుడు దివాకర్

అనంతపురం: ఓ యువకుడు ఇద్దరు యువతులను ప్రేమించి మోసం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన యువతులు వాస్మాయిల్ తాగారు. ఇందులో ఒకరు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం గెరిశనపల్లికి చెందిన దివాకర్ అనంతపురం బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గతంలో ముదిగుబ్బకు చెందిన రేష్మ అనే యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. పెద్దలు రేష్మకు వివాహం చేయగా.. పెళ్లయిన నెలకే ఆమె తన భర్తకు విడాకులు ఇచ్చింది. మళ్లీ దివాకర్‌తో ప్రేమాయణం సాగించింది. ఈ క్రమంలో రూ.2 లక్షలకు పైగా డబ్బు ఇచ్చింది. కాగా, కణేకల్లు మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన శారద (23) అనే యువతితోనూ దివాకర్ ప్రేమాయణం సాగించాడు. అటు రేష్మ, ఇటు శారద ఇద్దరితోనూ ఏకకాలంలో ప్రేమ బంధం నడిపాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసేవాడు. ఇటీవల శారదకు దివాకర్ తీరుపై అనుమానం వచ్చి ఇన్‌స్టాగ్రామ్‌ను పరిశీలించగా.. రేష్మతో అతడి బాగోతం బయటపడింది. ఇదే క్రమంలో రేష్మ కూడా దివాకర్‌ను నిలదీసింది. విషయం తెలుసుకున్న రేష్మ కుటుంబ సభ్యులు ఆమెను కదిరిలో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపారు. అయితే, శనివారం దివాకర్‌తో మరోమారు రేష్మ ఫోన్‌లో వాగ్వాదానికి దిగింది. ఈ క్రమంలో దివాకర్ కదిరికి వెళ్లి ఆమెను బైక్‌పై అనంతపురం తీసుకొచ్చాడు. శారద ఉంటున్న హాస్టల్‌లోనే ఆమెను వదిలాడు. ఆదివారం సాయంత్రం రేష్మ, శారదలు దివాకర్‌ను తామున్న చోటుకు పిలిచి ఇద్దరినీ పెళ్లిచేసుకోవాలని కోరారు. అయితే, తానెవరినీ పెళ్లి చేసుకునేది లేదంటూ దివాకర్ వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన ఇద్దరు యువతులు ఆర్టీఓ కార్యాలయం వద్దకు వెళ్లి వాస్మాయిల్ తాగారు. విషయాన్ని దివాకర్‌కు ఫోన్‌లో తెలియజేయగా.. వెంటనే అతను అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో ఇద్దరినీ ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించాడు. ఆస్పత్రిలో చికిత్స ఫలించక శారద మృతి చెందింది. రేష్మ పరిస్థితి నిలకడగా ఉంది. శారద వాస్మాయిల్ ఎక్కువ తాగిందని, రేష్మ కొంచెమే సేవించినట్లు గుర్తించిన పోలీసులు ఇందులో రేష్మ పాత్రపైనా ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

తాగుతాం.. తాగి ఊగుతాం..



మద్యం ఎక్కువై రోడ్డుపై పడి ఉన్న మందుబాబు



వృద్ధుడిని బూతులు తిడుతున్న తాగుబోతు

ధర్మవరం రూరల్: మేము తాగుతాం... ఎక్కడ పడితే అక్కడ పడిపోతాం...నీ కెందుకు ముసలోడా అంటూ తాగుబోతులు దారిని పోయే వారిని బండ బూతులు తిట్టిన సంఘటన పోతుకుంట రోడ్డు దగ్గర ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. ధర్మవరం రూరల్ ప్రాంతానికి కేటాయించిన మద్యం దుకాణాన్ని నిబంధనలకు విరుద్ధంగా పట్టణ పరిధిలో పోతుకుంట బీసీ కాలనీ సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ మద్యం దుకాణం వద్దే మద్యం సేవించడానికి రూములు ఏర్పాటు చేశారు. మద్యం ప్రియులు వైన్ షాపు వద్దే పూటుగా మద్యం సేవించి నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే పోతుకుంట రోడ్డు పక్కనే పడిపోతున్నారు. దారినపోయే వారు అయ్యో పాపం అంటూ లేపబోతే కొందరు వారినే నానా బూతులు తిడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళలో మహిళలు ఈశ్వరుని గుడికి వెళ్తుంటారు. ఆ ప్రాంతంలో తాగుబోతులు రోడ్డుపైనే చిందులేస్తుండటంతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం ఓ మద్యం ప్రియుడు పూటుగా తాగి అక్కడే పడిపోయాడు. ఓ వృద్ధుడు ఏమైంది బాబూ అంటూ అక్కడికి వస్తుండగా మరో తాగుబోతు ఆ వృద్ధుడిని బూతులు తిడుతూ దాడికి యత్నించాడు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్య కృత్యం అయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు



అలకంరణలో సాయీశ్వర లింగం

భక్తిశ్రద్ధలతో అతిరుద్ర మహాయజ్ఞం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత అతిరుద్ర మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం పదో రోజు ఉదయం వేదపండితులు వేద మంత్రాల నడుమ యజ్ఞ క్రతువులు నిర్వహించారు. సాయంత్రం యజ్ఞ క్రతువులలో భాగంగా కర్మార్చన, అష్టావధాన సేవ చేశారు. అనంతరం ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి గోదా అనంత సోమయాజీ అతిరుద్ర మహాయజ్ఞాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తర్వాత ప్రముఖ సంగీత విద్వాంసుడు అభిషేక్ రఘురామ్ బృందం పరమేశ్వరుడిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరి అందరినీ అలరించింది.



సంగీత కచేరి నిర్వహిస్తున్న అభిషేక్ రఘురామ్ బృందం

క్లుప్తంగా

పాముకాటుతో బాలిక మృతి


ప్రీతి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: పాముకాటుతో ఓ బాలిక మృతి చెందింది. వివరాలు... చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన కనుముక్కల రాజశేఖర్, విశాలాక్షి దంపతులకు ఓ కుమారుడు కుమార్తె ఉన్నారు. వీరి కుమార్తె ప్రీతి (8) స్థానిక తూర్పుబావులు ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను పాము కాటేసింది. విషయాన్ని వెంటనే తల్లిదండ్రులకు తెలపడంతో వారు పుట్టపర్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం ప్రీతి మృతిచెందింది. ఒక్కాగానొక్క కుమార్తె మృతితో తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది.

వర్ధమాన క్రీడాకారుడి దుర్మరణం


సాయికిరణ్ (ఫైల్)

పావగడ: కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వర్ధమాన క్రీడాకారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడకు చెందిన మాకం వి.సాయికిరణ్ (24) జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడిగా ఖ్యాతిగాంచాడు. ఈ క్రమంలో స్థానిక విద్యార్థులకు హ్యాండ్ బాల్ క్రీడపై శిక్షణనిస్తూ వస్తున్నాడు. శనివారం రాత్రి తన స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు వెళుతుండగా నెలమంగల వద్ద వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో సాయికిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక క్రీడా సంఘాల ప్రతినిధులు, స్నేహితులు సంతాపం వెలిబుచ్చారు.

జింక మాంసం విక్రేత అరెస్ట్

చిలమత్తూరు: జింక మాంసం విక్రయిస్తూ హిందూపురం రూరల్ మండలం మలుగూరుకు చెందిన బాలిరెడ్డి ఆదివారం పోలీసులకు పట్టుబడ్డాడు. అందిన సమాచారంతో అప్రమత్తమైన హిందూపురం రూరల్ పోలీసులు మలుగూరు వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామ శివారున పొలాల్లో జింక తలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

కుక్కల తలలు నరికివేత

రాయదుర్గం టౌన్: మండలంలోని వేపరాళ్ల వద్ద మూడు కుక్కల తలలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామ శివారులోని పాత లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కుక్కల మెడలను వేరు చేసి పక్క పక్కనే పడేశారు. కాగా, విజయనగర రాజుల 3వ రాజధానిగా ఖ్యాతిగాంచిన రాయదుర్గం ప్రాంతంలో గుప్త నిధుల కోసం దుండగులు కొన్నేళ్లుగా తవ్వకాలు సాగిస్తున్నారు. తాజాగా గుప్త నిధిని వెలికి తీసేందుకు కుక్కలను బలి ఇచ్చి ఉంటారనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. ఈ అంశానికి సంబంధించి లోతైన విచారణ చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీసులను గ్రామస్తులు కోరారు.

కోర్కెలు తీర్చే మహా వృక్షం

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన తిమ్మమ్మ మర్రిమాను
- 25 నుంచి జాగరణ మహోత్సవాలు
- అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తులు


తిమ్మమాంబ, బాలవీరయ్య ప్రతిమలు


తిమ్మమ్మ మర్రిమాను

ఎన్పీకుంట: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద వృక్షంగా పేరుగాంచిన తిమ్మమ్మ మర్రిమాను మహాశివ రాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. కోరిన కోర్కెలు తీర్చే మహావృక్షంగా ఖ్యాతి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద మంగళవారం నుంచి శివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే తిమ్మమాంబ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్తి చేశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా...

ఎన్పీ కుంట మండలం గూటిబైలు గ్రామంలో వెలసిన తిమ్మమ్మ మర్రిమాను 8.15 ఎకరాల్లో వేలాది ఊడలతో విస్తరించింది. ఈ మహావృక్షం వెనుక ఓ పురాణగాథ ఉంది. బుక్కపట్నానికి చెందిన వెంకటప్ప, మంగమాంబ దంపతులకు కుమార్తె తిమ్మమాంబకు గూటిబైలుకు చెందిన బాలవీరయ్యతో వివాహమైంది. కొన్నాళ్లపాటు వీరి జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలోనే అనారోగ్యం బారిన పడిన వీరయ్య మృతి చెందడంతో ఆ రోజుల్లో కొన సాగుతున్న ఆచారం మేరకు తిమ్మమాంబ సతీసహగమనానికి సిద్ధమైంది. చితిలోకి దూకేందుకు ఎత్తు కోసం నాలుగు ఎండిన మర్రి గుంజలను (కట్టెలు) నాటారు. ఆ నాలుగింటిలో ఈశాన్య దిశలో నాటిన గుంజం చిగురించి అది మహావృక్షంగా ఎదిగింది. అప్పటి నుంచి ఈ చెట్టుకు 'తిమ్మమ్మ' అనే పేరు పెట్టారు. 1989లో కర్ణాటక ప్రాంతానికి చెందిన జర్నలిస్టు సత్యనారాయణ అయ్యర్ కృషి ఫలితంగా ఈ మహా వృక్షం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకుంది. అప్పటి నుంచి ప్రపంచ పర్యాటకుల దృష్టి తిమ్మమ్మ మర్రిమానుపై పడింది. మొత్తం 1,355కు పైగా ఊడలతో ఉండే ఈ మర్రి మానుకు దాదాపు 660 సంవత్సరాలు నిండాయి. ఈ ప్రాంతంలో నిర్మించిన తిమ్మమాంబ, బాలవీరయ్య ఆలయాన్ని 2011లో బెంగళూరుకు చెందిన కైవారం యోగి నారాయణస్వామి ట్రస్ట్ ధర్మాధికారి డాక్టర్ ఎంఎస్ జయరాం ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. నూతన ఆలయంలో తిమ్మమాంబ అమ్మవారు నిత్యపూజలతో అలరారుతున్నారు. ఆలయానికి ఎదురుగా తిమ్మమాంబ సతీసహగమనం చేసిన ప్రదేశంలో తిమ్మమ్మ ఘాట్‌ను అత్యంత సుందరంగా నిర్మించారు. ఇక్కడికి వచ్చే యాత్రికులకు, భక్తులకు తిమ్మమ్మ చరిత్ర, మర్రిమాను విశిష్టతను వివరించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇద్దరిని గైడ్‌లుగా నియమించారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

ఈ నెల 25వ తేదీన మంగళవారం ఉందయం అమ్మవారి రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గ్రామ వీధులతో పాటు సమీప గ్రామాల్లో అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రి సందర్భంగా తిమ్మమ్మ మర్రిమాను వద్ద జాగరణ ఉంటుంది. భక్తులకు తిమ్మమాంబ సంపూర్ణ జీవిత చరిత్రను ఎద్దుల బుర్రకథ రూపంలో మనోహర్ బృందం వివరించనుంది. అలాగే చెక్కభజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం తిరిగి వెళతారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగున ఉన్న అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఏర్పాట్లను ఇప్పటికే నిర్వాహకులు పూర్తి చేశారు.


తిమ్మమాంబ ఘాట్


శివ ప్రాజెక్టు

ఇలా చేరుకోవచ్చు...

తిమ్మమ్మ మర్రిమాను వద్దకు చేరుకునేందుకు ప్రధానంగా రెండు మార్గాలు ఉన్నాయి. కదిరి–రాయచోటి మార్గంలో ఉన్న గాండ్లపెంట మండలం రెక్కమాను నుంచి ఆటోలు, బస్సులు ఉంటాయి. 8 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేస్తే మర్రిమానుకు చేరుకోవచ్చు. అలాగే కదిరి–మదనపల్లి జాతీయ రహదారిపై కొక్కంటి క్రాస్ నుంచి ఆటో, బస్సుల్లో 12 కిలోమీటర్లు ప్రయాణించి మర్రిమానుకు చేరుకోవచ్చు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్ మైనుద్దీన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదిరి బస్టాండ్ నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు చొప్పున గాండ్లపెంట, రెక్కమాను మీదుగా బయలుదేరుతుంది. కదిరిలోని జీవిమాను సర్కిల్, గాండ్లపెంట రెక్కమాను, తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో ప్రత్యేక స్టాపింగ్‌లు ఏర్పాటు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో గడ్డి వామి, సపోట చెట్లు దగ్ధం


కాలిపోయిన సపోట చెట్లు

గోరంట్ల: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాల్లో గడ్డివామి, సపోట చెట్లు కాలిపోయాయి. వివరాలు...గోరంట్లలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక గుజరీ శ్రీనివాసులు షెడ్డు ఏర్పాటు చేసుకుని గొర్రెల పోషణ చేపట్టాడు. ఈ నేపథ్యంలో గొర్రెల కోసమని రూ.2 లక్షలకు పైగా వెచ్చించి 10 ట్రాక్టర్ల వేరుశనగ కట్టెని కొనుగోలు చేసి వామి వేశాడు. ఆదివారం ఉదయం సమీపంలోని బీడు భూమిలో ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి గడ్డివామిని చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేలోపు గడ్డి వామి పూర్తిగా కాలిపోయింది. మరో ఘటనలో గోరంట్ల మండలం పులేరు సమీపంలో మంటలు చెలరేగి సపోట తోట కాలిపోయింది. దాదాపు 300 సపోట చెట్లు కాలిపోవడంతో రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు సోమశేఖర్ వాపోయాడు. పక్క రైతు పొలంలో పిచ్చి మొక్కలను కూలీల ద్వారా తొలగించి నిప్పు పెట్టడం ద్వారా మంటలు వ్యాపించినట్లుగా బాధిత రైతు తెలిపాడు.


కాలి బూడిదైన గడ్డి వామి

లైనింగ్ పనులతో తీరని నష్టం

- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం
- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలి
- పనులను ఐకమత్యంతో అడ్డుకుందాం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


ఓబుళంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేస్తే భూగర్భంలోకి జలాలు ఇంకిపోకుండా ఈ ప్రాంతంలో ఎడారి ఛాయలు అలుముకునే ప్రమాదముందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి తీరని నష్టం కలిగించే ఈ పనులను అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సీకేపల్లి మండలం వెంకటంపల్లి, ఓటుళంపల్లి గ్రామాల్లో ఆదివారం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, అఖిలపక్ష నేతలతో కలసి రచ్చకట్ట సమావేశాలు ఏర్పాటు చేసి, మాట్లాడారు. గతంలో తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీరు రాక రైతులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. బతుకు తెరువు కోసం అప్పట్లో రైతులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి కుటుంబాలను పోషించుకున్నారన్నారు. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హంద్రీ–నీవా కాలువ పనులకు శ్రీకారం చుట్టారని, ఆ సమయంలో కాలువలో నీటి ప్రవాహం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వస్తుండటంతో పంటల సాగుతో రైతులు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం కుప్పం ప్రాంతానికి నీటిని త్వరగా తరలించాలనే ఉద్దేశ్యంతో హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ పనులకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే నీరు భూగర్భంలోకి ఇంకకుండా ఉమ్మడి జిల్లాలోని అనేక నియోజక వర్గాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోనే హంద్రీ –నీవా కాలువ దాదాపు వంద కిలోమీటర్ల మేర ఉందని,. కాలువకు లైనింగ్ పనులు పూర్తయితే దాదాపు 1.50లక్షల ఎకరాల రైతులకు తీరని నష్టం చేకూరుతుందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం కుప్పం ప్రాంతానికి నీటిని తరలించేందుకు రాయచోటిలో లిఫ్ట్ ఇరిగేషన్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పనులు పూర్తి చేయగలిగితే ఇటు ఉమ్మడి జిల్లా రైతులతో పాటు అటు కుప్పం ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. అలా కాకుండా హంద్రీ–నీవా కాలువ పనులకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ వేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. రైతులతో కలసి శాంతియుత పోరాటాలు సాగిస్తామన్నారు. లైనింగ్ పనుల వల్ల జరిగే నష్టాన్ని రైతులకు అర్థం అయ్యేలా వివరించి చైతన్యం తీసుకువస్తామన్నారు. ఇందుకోసం ఆత్మకూరు మండలం సింగంపల్లి నుండి కనగానపల్లి, రామగిరి మండలాల మీదుగా చెన్నేకొత్తపల్లి వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు సానే రాజారెడ్డి, మండల నాయకులు, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పెద్ద సంఖ్యలో రెతులు పాల్గొన్నారు.

విలేకరిపై బెదిరింపులు సరికాదు


విలేకరులతో మాట్లాడుతున్న టీఎన్ దీపిక, వేణురెడ్డి

చిలమత్తూరు: ఉన్నవి రాస్తే ఉలికి పాటు ఎందుకు అని టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్టీ నేత వేణురెడ్డి ప్రశ్నించారు. ఈ నెల 19న 'గాడి తప్పిన పాలన.. ఆస్తులకు దక్కని రక్షణ' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురితమైంది. దీంతో స్థానిక సాక్షి విలేకరికి ఓ టీడీపీ నేత వాట్సాప్ కాల్ చేసి బెదిరింపులకు దిగాడు. విషయం తెలుసుకున్న దీపిక, వేణు రెడ్డి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ నేత బెదిరింపులను ఖండించారు. పురాతన కనుమ లక్ష్మీనారసింహస్వామి ఆలయానికి ఎంతో ప్రాశస్త్యముందన్నారు. అలాంటి ఆలయ ఆస్తులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ లోపాన్ని సరిచేసుకోవాలంటూ సందేశాత్మక కథనాన్ని ఇచ్చిన విలేకరిని అభినందించాల్సింది పోయి... బెదిరింపులకు దిగడం సిగ్గు చేటన్నారు. ఈ బెదిరింపులను బట్టి చూస్తే ఆలయ పరిరక్షణ కంటే వారి సొంత లాభమే ఎక్కువ అనేది స్పష్టమవుతోందన్నారు. ఇటీవల ప్రశాంత్ అనే రిపోర్టర్‌పై కూడా దాడి చేశారని, పాత్రికేయులపై దాడులు, దౌర్జన్యాలు తమను కలచివేస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించబోమన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు


సమావేశమైన జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

హిందూపురం టౌన్: జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ యాన్యువల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత సంవత్సరంలో సాధించిన విజయాలను వివరించారు. జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను, కోచ్‌లు, మేనేజర్లుగా వ్యవహరించిన వారిని అభినందించారు. రానున్న రోజుల్లో జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సలీమ్, కోశాధికారి శేఖర్, జాయింట్ సెక్రటర్లు కార్తీక్, శ్రీనివాసులు, ఈసీ మెంబర్లు ఆజాద్, హర్షవర్ధన్, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి మొరార్జీ యాదవ్, పీడీలు లోకనాథ్, రామాంజినేయులు, మహేష్ దీపక్, కోచ్‌లు చైతన్య, హరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై నేడు నిరసన


కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: రైతాంగ సమస్యలపై సోమవారం గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విడుదల చేసి, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై విధించే మూడు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయడంతో పాటు అన్ని పంటలకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలని, హంద్రీ–నీవా కాలువలను వెడల్పు చేస్తూ అన్ని చెరువులనూ నీటితో నింపాలని, వ్యవసాయ మోటర్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధరలు తగ్గించాలని, విద్యుత్ అదనపు చార్జీలు రైతులపై పడకుండా చూడాలని, తదితర డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారుతి, ఎస్‌హెచ్‌బాషా, ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

విషపు నీరు తాగి గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

బ్రహ్మసముద్రం: విషతుల్యమైన నీటిని తాగి 29 గొర్రెలు మృతిచెందాయి. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప గ్రామానికి చెందిన కాపరులు బొమ్మన, రామాంజనేయులు, కోళ్ల తిప్పేస్వామి... గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం గ్రామ సమీపంలోని పొలాల్లో గొర్రెలను మేపునకు వదిలారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పొలాల్లోని నీటిని గొర్రెలు తాగాయి. అయితే అప్పటికే పంటలకు పిచికారీ చేసేందుకు ఆ నీటిలో యూరియా కలిపిన విషయాన్ని కాపరులు గుర్తించలేదు. కాసేపటి తర్వాత ఒకదాని వెనుక ఒకటి గొర్రెలు మృత్యువాత పడుతుండడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న మండల పశు వైద్యాధికారి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే బొమ్మన్నకు చెందిన 9, రామాంజినేయులుకు చెందిన 12 , కోళ్ళ తిప్పేస్వామికి చెందిన 8 గొర్రెలు మృతి చెందాయి. అస్వస్థతకు గురైన మరో 15 గొర్రెలకు వైద్యాధికారి చికిత్స అందజేశారు.

సజావుగా గ్రూప్‌-2 మెయిన్స్

- 88.46 శాతం అభ్యర్థుల హాజరు


అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు


పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థిని

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం 14 కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష సజావుగా జరిగింది. అభ్యర్థుల హాజరు 88.46 శాతం నమోదైంది. పరీక్షకు 7,293 మంది హాజరు కావాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 6,463 మంది హాజరయ్యారు. 830 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్–2 పరీక్షకు 6,441 మంది హాజరుకాగా 852 మంది గైర్హాజరయ్యారు.పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ వేరువేరుగా సందర్శించి పరీక్షల తీరును, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును జిల్లా ఎస్పీ పి.జగదీష్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ఎస్ షరీఫ్, సెక్షన్ ఆఫీసర్లు శంకర్‌రావు, ఆరోగ్యరాణి, నాగభవానీ పర్యవేక్షించారు.

ఏపీపీఎస్సీ తీరుపై అభ్యర్థుల ఆవేదన

ఏపీపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్ అసంబద్ధంగా ఉందని, రిజర్వేషన్ రోస్టర్ సక్రమంగా పాటించని కారణంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని పలువురు అభ్యర్థులు వాపోయారు. రిజర్వేషన్ 70 శాతం దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇక మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు మించి కల్పించారని, దీంతో పురుష అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అభ్యర్థుల శ్రేయస్సును, భవిష్యత్తును ఏపీపీఎస్సీ దృష్టిలో ఉంచుకుని రోస్టర్ సరిదిద్దిన తరువాతనే పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

రోస్టర్ సరిదిద్దాలి



రిజర్వేషన్ల రోస్టర్‌ను కేటగిరీ వారీగా చూపించాల్సి ఉన్నా అలా చేయలేదు. దీంతో అభ్యర్థులకు చాలా నష్టం జరుగుతుంది. మహిళలకు అన్ని కేటగిరీల్లో కలిపి 33 శాతం రిజర్వేషన్ చూపాలి. అలా కాకుండా ఎక్కువగా చూపారు. రిజర్వేషన్ రోస్టర్‌ను సరిదిద్దకపోతే అభ్యర్థులకు అన్యాయం చేయడమే అవుతుంది.

– లక్ష్మీపతి, గ్రూప్‌–2 అభ్యర్థి, అనంతపురం

ఓపెన్ కేటగిరీకి చాలా నష్టం



రిజర్వేషన్ రోస్టర్‌లో తప్పులున్నాయి. ముఖ్యంగా రాయలసీమ జోన్‌లో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ పోస్టులు చూపించారు. ఈ కారణంగా ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు చాలా నష్టపోతారు. ప్రధానంగా ఓపెన్ కేటగిరీలోని పురుష అభ్యర్థులకు ఎక్కువ నష్టం కలుగుతుంది.

– సంజీవరెడ్డి, గ్రూప్‌–2 అభ్యర్థి, తనకల్లు